


19న బీసీ కుల సంఘాల సమావేశం

గణేశ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీ కుల సంఘాల సమావేశం ఈనెల 19న టవర్ సర్కిల్ లోని స్వర్ణకారుల భవనంలో నిర్వహించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ ఉద్యమం బలోపేతం చేయ డానికి ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు సంఘటితంగా ముందుకు పోవాలన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని బీసీ నాయకులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

కరీంనగర్-జగిత్యాల రోడ్డుకు మోక్షమెప్పుడో?

- రహదారి విస్తరణకు రూ.2227 కోట్ల కేటాయింపు
- కేంద్రం నిధులు కేటాయించినా పూర్తి కాని భూసేకరణ
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



బైపాస్ రోడ్డులో ప్రమాదకరంగా గుంత

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కేంద్ర ప్రభుత్వం కరీంనగర్-జగిత్యాల రోడ్డును జాతీయ రహదారిగా-563గా ప్రకటించింది. ఈ రోడ్డును నాలుగు లైన్లతో విస్తరించేందుకు ఏడేళ్ల క్రితమే 2,227 కోట్ల రూపాయలు కేటాయించింది. గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రోడ్డును పట్టించుకోకుండా పూర్తిగా నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికీ భూసేకరణ కూడా పూర్తి కాలేదు. పేరుకే ఇది జాతీయ రహదారిఅయినప్పటికీ గ్రామీణ రోడ్లకంటే అధ్వానంగా తయారైంది. నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డులో రేయింబవళ్లు తిరుగుతుంటాయి. రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ప్రతి రోజూ ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. కరీంనగర్ నుంచి జగిత్యాలకు 50 కిలోమీటర్లు ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆ రోడ్డుగుండా వెళ్లే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళుతున్నారు. జాతీయ రహదారి నాలుగు రోడ్లతో అభివృద్ధి చేయాల్సిన అధికారులు భూసేకరణపై కూడా శ్రద్ధ చూపడం లేదు.

ఇరుకు దారిలో ప్రమాదకర మలుపులు

ప్రస్తుతం ఉన్న రోడ్డు అనేక మలుపులతో, ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. మూలమలుపుల వద్ద భయం భయంగా వాహనాలను నడపాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ నుంచి జగిత్యాలకు వెళ్లే బైపాస్‌రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ప్రతి 100 మీటర్లకు ఒకటి చొప్పున పెద్దపెద్ద గుంతలు పడటంతో భారీ వాహనదారులే కాకుండా ద్విచక్రవాహనదారులు ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే భయపడుతున్నారు.

రాత్రి వేళల్లో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లు, ఇతర చెట్లు, వీధిదీపాలు లేకపోవడంతో చీకట్లో, పెద్దపెద్ద గుంతల నుంచి వెళ్లడం మరింత కష్టంగా మారిదంటూ వాహనదారులు అంటున్నారు. కరీంనగర్ నుంచి జగిత్యాల వరకు రద్దీగా ఉండే ఈ జాతీయ రహదారిలో ప్రతీ రోజు ఎక్కడో కొన్ని చోట్ల చిన్నచితక ప్రమాదాలు జరుగడమే కాకుండా ఎంతో మంది ఈ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. డేంజర్ బెల్స్ మోగిస్తున్న ఈ రోడ్డును నాలుగు లైన్లతో జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని పదేళ్లుగా స్థానికులు, వాహనదారులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను కూడా పూడ్చి శాశ్వత చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే ఈ జాతీయ రహదారిలో దాదాపు నిమిషానికి ఒకటి చొప్పున వరుసబెట్టి వాహనాలు వెళ్తుంటాయి. ప్రస్తుతం రెండువరుసలతో ఉన్న ఈ రోడ్డు గుండా రద్దీ ఎక్కువగా ఉండడంతో ఓవర్‌టేక్ చేయడం గగనమవుతోంది. ఈ రహదారిలో ఆరు మేజర్, 18 మైనర్ బ్రిడ్జిలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 195 చోట్ల కల్వర్టులు నిర్మించాలని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికీ ఈ రోడ్డు అభివృద్ధి పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.

అధ్వానంగా బైపాస్ రోడ్డు

వరంగల్, హైదరాబాద్ నుంచి వచ్చే గూడ్స్ గ్రానైట్ లాంటి ఇతర భారీ వాహనాలు కరీంనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి లోయర్ మానేరు

మిగతా 8లో...





ఇదేమి చెత్త ఫీజు

- నెలకు రూ. మూడు వేల నుంచి ఐదు వేలు ఇవ్వాలా..
- బల్దియా వసూళ్లపై చిరు వ్యాపారులు, అపార్ట్‌మెంట్స్ యజమానులు ఆందోళన

కరీంనగర్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాణిజ్య, వ్యాపార సంస్థల నుంచి చెత్త సేకకరణ బాధ్యతలను నగరపాలక సంస్థ ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించింది. వారు చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా నెలకు మూడు వేల నుంచి ఐదు వేల రూపాయలు ఇస్తేనే చెత్త తీసుకెళ్తామంటున్నారు. కొంత మంది విద్యార్థులతో హాస్టళ్లు నిర్వహిస్తున్న నిరుద్యోగులు, చిన్నచిన్న హోటళ్ళు, రెస్టారెంట్లు నడుపుకునే చిరువ్యాపారులు, అపార్టుమెంట్ యజమానులు నెలకు ఇంత ఫీజులు ఎలా చెల్లిస్తామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు మూడు వేల నుంచి ఐదు వేల రూపాయలు ఇస్తే ఏడాదికి 40 వేల నుంచి 60 వేల వరకు చెత్తకే పోతే అద్దెలు, ఇతరత్రా ఖర్చులు ఎలా భరించాలని ఆందోళన చెందుతున్నారు.

చిన్నా లేదు.. పెద్దా లేదు

నగరపాలక సంస్థ నగరంలోని హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు, హాస్టళ్లు, బ్యాంక్వెట్ హాల్స్, ఫంక్షన్ హాల్స్, మాల్స్, విద్యాసంస్థల నుంచి నిత్యం భారీగా వెలువడుతున్న చెత్తను తరలించేందుకు చెత్త సేకరణ ఫీజు వసూలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే స్వచ్ఛ ఆటోలు, రిక్షాల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించేందుకు ఇంటింటికి నెలకు 50 రూపాయలను వసూలు చేస్తున్నారు. హాస్పిటల్స్ నుంచి వెలువడే వ్యర్థాలను వేరుచేసి తీసుకెళ్లేందుకు ప్రత్యేక ట్రాక్టర్లను ఏర్పాటు చేసి ఫీజు వసూలు చేస్తున్నారు. చికెన్, మటన్ సెంటర్ల నుంచి వేస్టేజీ సేకరణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి ఫీజులు వసూలు చేస్తుంది. ఇటీవల చెత్త భారీగా వెలువడే సంస్థల నుంచి చెత్త సేకరణకు టెండర్ నిర్వహించగా ఏడాదికి 60 లక్షలతో ప్రైవేట్ వ్యక్తులు కాంట్రాక్టు తీసుకున్నారు.

చిన్న, పెద్ద సంస్థలకు వేర్వేరుగా గానీ చెత్త సేకరణ ఫీజును మున్సిపల్ అధికారులు నిర్ణయించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ వ్యక్తులు ఇటీవలనే చెత్తసేకరణ ప్రారంభించారు. ఈ కాంట్రాక్టర్ చిన్న, పెద్ద అనే తేడాను గమనించ కుండానే మూడు వేల నుంచి ఐదు వేలు ఇవ్వాల్సిందేనని, లేనిపక్షంలో చెత్తను తీసుకెళ్లమంటూ వ్యాపారసంస్థలు, అపార్టుమెంట్ల నిర్వాహకులకు చెప్పారు. దీంతో వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తం ఎలా చెల్లిస్తామని, ఇప్పటి వరకు స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు, రిక్షాల వారికి నెలకు 500 రూపాయలు ఇచ్చేవారమని, ఇప్పుడు ఏకంగా మూడు వేలు, ఐదు వేలు ఎలా వసూలు చేస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక చెత్త వెలువడే సంస్థల నుంచి మూడు వేలు, ఐదు వేలు తీసుకుంటే అభ్యంతరం లేదు కానీ, చిన్న సంస్థల నుంచి కూడా చెల్లించాలనడం సరికాదని, చెత్త చార్జీలను మున్సిపల్ అధికారులు తగ్గించి తీసుకునేందుకు ఆదేశాలివ్వాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా

టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి



టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందచేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

సుభాష్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మెన్ దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ టీఎన్‌జీవోస్ భవన్‌లో ఆయనతో అంగన్‌వాడీ ఉద్యోగులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ప్రభుత్వాలు ఇచ్చే పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం తమకు అప్పగించిన ప్రతి సర్వేను పూర్తి చేస్తున్నా మని, ఎన్నికల విధులు, బీఎల్‌వో డ్యూటీలు నిర్వహిస్తున్నామన్నారు. విష జ్వరాలు ప్రబలిన పుడు, కరోనా లాంటి భయంకరమైన వ్యాధులు వ్యాపించినపుడు తమ సొంత ఫోన్లతో ఇంటింటి సర్వేలను చేశామని తెలిపారు. చాలీ చాలని జీతం, భద్రతా హామీలేకుండా పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్లను సక్రమంగా నిర్వహించుకుంటూనే ప్రభుత్వం అదనంగా అప్పగించే అన్ని పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల కొన్ని సంఘటనల వల్ల తమంతా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక తప్పిదాల వల్ల చర్యలు తీసుకుంటే దాని ప్రబావం వారి కుటుంబంపై పడుతుందన్నారు. అనంతరం టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ తానని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, అంగన్‌వాడీ ఉద్యోగులు ఏరువా లలితామేరి, స్వరూప, భాగ్యలక్ష్మి, లక్ష్మి, రమణరెడ్డి, ఊర్మిళ, వసంత, పద్మశ్రీ పాల్గొన్నారు.

మద్దతు ధర దక్కాలంటే..



- కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తేవాలి
- తేమ శాతం 17 లోపు ఉండేలా ఆరబెట్టాలి

హుజూరాబాద్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించిన వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే కోసి కుప్ప పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఆరుగాలం శ్రమించి వరి పంట పండించిన రైతులు తమ పంటకు ప్రభుత్వ మద్దతు ధర పొందాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ధాన్యం ఆరబోయకుండా మార్కెట్‌కు తీసుకెళ్తే మద్దతు ధర రాదు. ఈ నేపథ్యంలో రైతులు వరి కోతల నుంచి అమ్మకం వరకు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందవచ్చు.

కోతకు ముందు, తర్వాత పాటించాల్సినవి..

వరి గింజలన్నీ బంగారు రంగులోకి వచ్చిన తర్వాతనే కోతలు ప్రారంభించాలి. కోతకు 15 నుంచి 20 రోజుల ముందే నీటి తడులు ఆపివేయాలి. 1010 రకం వరిగింజలు బంగారు రంగులోకి వచ్చే వరకు ఆగితే రాలిపోతాయి. ఈ ఒక్క రకాన్ని గోధుమ రంగులోకి రాగానే కోయాలి. ఒక రకానికి చెందిన ధాన్యాన్ని మరో రకంతో కలపొద్దు. పొలం వద్దే సరైన గ్రేడింగ్ చేయాలి. గడ్డిని తీసివేసి గింజలన్నీ కుప్పగా పోసి తాలు గింజలు శుభ్రంగా తూర్పార పట్టాలి. ధాన్యంలో 17 శాతం లోపు తేమ ఉండే వరకు ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే మద్దతు ధర వస్తుంది.

వడ్లను సిమెంట్ కల్లాలు లేదా టార్పాలిన్ షీట్లపై ఆరబెట్టాలి. రెండు, మూడు రోజులు బాగా ఎండలో కాళ్లతో కలియ దున్నాలి. పంట కోశాక సరిగ్గా ఆరబెట్టకపోతే గింజలు రంగు మారి, పంట నాణ్యత తగ్గ తుంది. పంటను ఆరబెట్టే సమయంలో రాళ్లు, మట్టి పెళ్లలు, చెత్తా చెదారం వంటి వ్యర్థాలు చేరకుండా జాగ్రత్త వహించాలి. నిల్వ చేసే పక్షంలో గోనె సంచులను కింద వేయకుండా కవర్లు పరిచి లేదా బల్లలపై బస్తాలు నెట్టుగా వేయాలి. పురుగులు ఆశించకుండా లీటరు నీటికి 5 ఎంఎల్ మలాథియాన్ మందును కలిపి బస్తాలపై పిచికారి చేయాలి. ఎలుకల నుంచి రక్షించుకోవడానికి బస్తాల మధ్య జింక్ ఫాస్ఫేట్ ట్యాబ్‌లెట్లు ఉంచాలి. ఒకరోజు తలుపులు పూర్తిగా మూసివేసి గాలి చొరబడకుండా జాగ్రత్తలు వహించాలి. ఇలా చేయడంతో ఎలుకలు లేకుండా పోతాయి. మరుసటి రోజు నుంచి తలుపులు తీయొచ్చు.

రైతులు తీసుకురావాల్సిన పత్రాలు

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చేటప్పుడు రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్, భూమి పట్టాదారు పుస్తకం జిరాక్స్ రైతుబంధుకు అనుసంధానమైన బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్లను వెంట తెచ్చుకోవాలి. కౌలు రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్, కౌలు ఇచ్చిన రైతు పట్టాదారు పుస్తకం జిరాక్స్‌లతోపాటు ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబరు, ఆయా మండలాల వ్యవసాయాధికారులతో జారీ చేసిన కౌలు సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి..

చాడ భూమిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, హుజూరాబాద్.



ప్రభుత్వం ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు 2,389, సాధారణ రకానికి 2,369 రూపాయల మద్దతు ధర ప్రకటించింది. ఈ ధర దక్కాలంటే రైతులు ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. తేమ 17 శాతంలోపు, తాలు ఒక శాతం ఉండాలి. మట్టి పెళ్లలు, రాళ్లులేకుండా చూసుకోవాలి. ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి.

రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలి

హుజూరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెగ్యులర్ మండల విద్యాధికారులను, ఉప విద్యాధికారులను నియమించాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హుజూరాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల తనిఖీలకు ఉపాధ్యాయులతో కూడిన పర్యవేక్షక కమిటీలు వేయడం సమంజసం కాదన్నారు. రెగ్యులర్ మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులను నియమించి వారి ద్వారానే పాఠశాలల్లో బోధనాభ్యసన కార్యక్రమాలు పర్యవేక్షించాలన్నారు.

కార్పొరేట్ విద్యా రంగంపై ప్రభుత్వ నియంత్రణ ఏ మాత్రం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రాంమోహన్, నారాయణరెడ్డి, దామోదర్, తిరుపతి, రమేష్, శ్రీరాంచక్రధర్, తూముల తిరుపతి, వేల్పుల రత్నం, శంకర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి..

గురుకులాల జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్‌లాల్



విజేతలతో శ్యాంప్రసాద్‌లాల్

తిమ్మాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి క్రీడల్లో ఆసక్తి కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని మహాత్మాజ్యోతి రావు పూలే గురుకులాల జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అండర్-17 క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి శ్యాంప్రసాద్‌లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడల్లో చురుకుగా పాల్గొనడం వలన శారీరక, మానసిక ఆరోగ్యానిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరిత, మానకొండూర్ పాఠశాల ప్రిన్సిపాల్ లావీణ, సిరిసిల్ల పాఠశాల ప్రిన్సిపాల్ సుస్మిత పాల్గొన్నారు.


ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలి

ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా

కరీంనగర్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీని ప్రకటించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నగరంలోని ఫిలింభవన్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌యూపీపీటీ జిల్లాశాఖ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

భాషా పండితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సంఘం ఆర్‌యూపీపీటీ మాత్రమేనని అన్నారు. పండితుల పదోన్నతి కోసం కృషి చేశామని, మిగిలిన వారికి కూడా పదోన్నతులు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు. రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రాచీన సంఘమైన ఆర్‌యూపీపీటీకి గుర్తింపు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆర్‌యూపీపీటీ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఆర్‌యూపీపీటీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్ కరుణాకర్



కరుణాకర్



జస్బీర్‌సింగ్

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ జిల్లా అధ్యక్షుడిగా ఎన్ కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా జస్బీర్‌సింగ్, కోశాధికారిగా ఎండీ వలి, గౌరవ అధ్యక్షు డిగా ఎండీ ఉమర్‌అలీ, సలహాదారులుగా పిన్నింటి బాల్‌రెడ్డి, ఇలావద్దీన్, మల్లారెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కోశాధికారిగా ఎన్ భిక్షపతి, ఇలావద్దీన్, స్వామి, ఎండీ జహంగీర్, మహిళా కార్యదర్శి సునిత, రాష్ట్ర బాధ్యులు, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

ప్లాట్ అమ్మబడును

కరీంనగర్, చింతకుంట గాంధీనగర్‌లో దాసరి విజయ గార్డెన్స్ ఎదురుగా రోడ్‌లో తూర్పు ఫేస్, 21ft. రోడ్, 39x30 సైజ్ 130 గజాల ప్లాట్ అమ్మబడును. నో బ్రోకర్స్. సెల్: 7382849187

AJK-250736

HOUSE FOR SALE

★ కరీంనగర్ జ్యోతినగర్‌లో ఉన్న 450 గజాల స్థలంలో ఇల్లు అమ్మబడును. 450 గజాల స్థలం మరియు ఇల్లుతో కలిపి మొత్తంగా అమ్మబడును. సెల్: 9849108465, 8309520255

AJK-250962

3+2 స్కీం కలదు

PROPERTY FOR SALE

★ 600 Sq.Yds Plot For Sale Near Satavahana University. Ph.: 9346394816 / 9573999953

AJH-3263

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, దట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 99854 10640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

ఎల్‌ఎండీ గేట్లు మూసివేత

తిమ్మాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం రెండు గేట్లను శనివారం మూసివేశారు. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.775 టీఎంసీల నీరున్నట్లు ఉంది. మోయతుమ్మెద వాగునుంచి 1581క్యూసెక్కులు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తుండగా మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 254క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెలుతోంది.

వందేమాతరం సర్టిఫికెట్ అందుకున్న ఉపాధ్యాయుడు


ఆదిరెడ్డి

కొడిమ్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఏనుగు ఆదిరెడ్డి అనే ఉపాధ్యాయుడు వందేమాతరం గేయం 150 సంవత్సరాలు నిండిన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆన్‌లైన్‌లో వందేమాతరం గేయపాడి డిల్లీకి పంపారు. ఉపాధ్యాయుడి ప్రతిభకు సంతృప్తి చెందిన ఢిల్లీ సాంస్కృతిక కార్యాలయం వారు శనివారం ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్‌ను పంపగా ఆదిరెడ్డి అందుకున్నారు.

స్కూటీలో నాగుపాము

హుజూరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన స్కూటీలో నాగుపాము పిల్ల ప్రత్యక్షమైంది. హుజూరాబాద్ పట్టణానికి చెందిన షౌకత్ తన స్కూటీని హనుమాన్ దేవాలయ సమీపంలో పార్కింగ్ చేశారు. స్కూటీలో పాము కనిపించడంతో స్థానికులు యజమానికి సమాచారం అందించారు. వెంటనే షౌకత్ స్కూటీవద్దకు వచ్చి స్నేక్ పార్క్‌ఔనీ చూడగా పెట్రోల్ ట్యాంక్ కింద ఉండడం గమనించారు. పామును స్కూటీలోనుంచి తీసి ఊరి బయట వదిలేశారు.

నాచుపల్లి జేఎన్‌టీయూలో విద్యార్థుల ధర్నా

● సెక్యూరిటీ సీఎస్‌ఓ సస్పెన్షన్

కొడిమ్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో శుక్రవారం అర్ధరాత్రి కళాశాల విద్యార్థులు ధర్నా చేశారు. సీఎస్‌ఓ(చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్)రాజిరెడ్డి మద్యం సేవించి వచ్చి దూషిస్తున్నాడని విద్యార్థులు ఆరోపిస్తూ ధర్నాకు దిగారు. అనంతరం సీఎస్‌ఓను విద్యార్థులు బంధించారు. సమాచారం అందుకున్న వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్ శుక్రవారం అర్ధరాత్రి ఘటన స్థలానికి చేరుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ విద్యార్థులకు నచ్చచెప్పి ప్రయత్నం చేయగా ఆగ్రహించిన విద్యార్థులు సీఎస్‌ఓపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. దీంతో సీఎస్‌ఓపై చర్యలు తీసుకుంటామని వైస్ ప్రిన్సిపాల్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నాను విరమించారు. శనివారం విచారణ చేసిన వైస్‌ప్రిన్సిపాల్ సీఎస్‌ఓ రాజిరెడ్డిపై నివేదికను ప్రిన్సిపాల్ జి నరసింహకు అందించారు. దీంతో ప్రిన్సిపాల్ సీఎస్‌ఓను సస్పెండ్ చేసినట్లు శనివారం రాత్రి వైస్ ప్రిన్సిపాల్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.





విదేశీ పండ్ల సాగు భళా

దేశ, విదేశీ పండ్ల మొక్కల సాగుపై ఆసక్తి
వినూత్న ప్రయోగాలు చేస్తున్న ఆదర్శ రైతులు
మంథని, రామగిరి మండలాల్లో కాతకు వచ్చిన పండ్లు

మంథని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చైనాకు చెందిన డ్రాగన్‌ఫ్రూట్, తైవాన్‌జామ, మలేషియన్, కాశ్మీర్ ఆపిల్, రష్యా ప్యాషన్‌ఫ్రూట్, నాసి ఫ్రూట్... ఇలా అనేక దేశ,విదేశీ పండ్లను సాగు చేస్తున్నారు ఇక్కడి రైతులు. విదేశీ పండ్లను గతంలో దిగుమతి చేసుకొని మహా నగరాల్లో విక్రయించేవారు. వాటిని స్థానికంగా సాగు చేస్తున్నారు రైతులు. దేశ,విదేశీ పండ్లను సాగు చేస్తున్న రైతులపై ఆంధ్రజ్యోతి స్పెషల్ స్టోరీ.

మంథని పట్టణ శివారులోని బస్సె చెరువు సమీపంలో పెద్దపల్లి రంజిత్ అనే యువకుడు ఏడాన్నర క్రితం రంజిత్ రెండు ఎకరా ల్లో డ్రాగన్ మొక్కలను ట్రెల్లిస్ సిస్టంలో సాగు చేశారు. ప్రస్తుతం నెలకు రెండు సార్లు డ్రాగన్ పండ్లను తెంపుతూ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పూత, మొగ్గ, కాయ దశకు రావటానికి 45 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. ప్రతి నెల రెండు సార్లు కాతకు వస్తుండటంతో డ్రాగన్ ఫ్రూట్ ను కట్ చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం స్థానిక పండ్ల మార్కెట్‌లో వ్యాపారుల ఇక్కడి డ్రాగన్ ఫ్రూట్స్‌ను విక్రయిస్తున్నారు. డ్రాగన్ తోపాటు తైవాన్ జామ, బొప్పాయి, హైబ్రీడ్ కొబ్బరి మొక్కలను, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేక ఫెన్సింగ్, డ్రిప్ సిస్టం ఏర్పాట్లు చేశారు. కూరగాయలను సైతం పండిస్తున్నారు.



రామగిరి మండలంలోని సుందిళ్ళ గ్రామానికి చెందిన అల్లువెల్లి రాజిరెడ్డి 12 గుంటల్లో దేశ, విదేశాల్లోని పండ్ల మొక్కలను పెంచుతున్నారు. దాదాపు రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి రెండున్నర ఏళ్లుగా వివిధ పండ్ల మొక్కలను సాగు చేస్తున్నారు. వివిధ రకాల మొక్కలను ఏపీలోని కడియం నర్సరీ నుంచి తెచ్చి ఇక్కడ పెంచుతున్నారు. కాశ్మీర్ ఆపిల్, 99 రకాలు, సీతా ఫలం, రామఫలం, లక్ష్మణ ఫలం, హనుమాన్ ఫలం, ఆపిల్ బేర్, అవకాడ, డ్రాగన్‌ఫ్రూట్ (రెడ్, వైట్ రకాలు), ప్యాషన్ ఫ్రూట్, కీవీ, వాక్కాయ లాంటి పండ్ల మొక్కలను పెంచుతున్నారు. వీటిలో కొన్ని కాతకు వచ్చి వచ్చాయి. ఇదే గ్రామానికి చెందిన మంగళ భగవతిరెడ్డి సైతం పండ్ల మొక్కలను పెంచుతున్నారు.

కల్వచర్ల గ్రామానికి చెందిన రాపెల్లి రమేష్ రెండు ఎకరాల్లో మహాగని మొక్కలు, డ్రాగన్ ఫ్రూట్, పెంచుతున్నారు. నాలుగేళ్లుగా వీటిని సాగు చేస్తున్నారు. తెలికపల్లి, ఎన్ని ఏళ్ళ నీటిలో నానినా చెడి పోని మహాగని 5 వందల మొక్కలను పెంచుతున్నారు. వీటిని స్టీమర్స్, సంగీత వాయిద్యాల, తలుపులు లాంటి వాటి తయారీకి ఉపయోగిస్తారు. ఇదే గ్రామానికి చెందిన వేముల వెంకటేష్ సైతం డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను పెంచడంతోపాటు షిప్, గోట్ ఫామింగ్ చేస్తున్నారు.

ఫార్మింగ్ అంటే చాలా ఇష్టం
పెద్దపల్లి రంజిత్, మంథని



ఎంబీఏ పూర్తి చేశా. కొంత కాలం డిజిటల్ మార్కెటింగ్‌లో పని చేశా. ఫార్మింగ్ అంటే ఇష్టంతో మంథనికి వచ్చాను. ఐదు ఎకరాల్లో వ్యవసాయం చేయటానికి శ్రీకారం చుట్టాను. రెండేళ్ల క్రితం చైనా డ్రాగన్, తైవాన్ జామ, హైబ్రీడ్ కొబ్బరి, బొప్పాయి లాంటి వాణిజ్య పంటల సాగు చేపట్టా. వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశా. ప్రస్తుతం డ్రాగన్‌ఫ్రూట్ దిగుబడి వస్తోంది. లోకల్ వ్యాపారులకు విక్రయిస్తున్నా. ఆదాయం కూడా బాగానే వస్తుంది. జామ, కొబ్బరి, బొప్పాయి కాతకు వచ్చాయి.

యూట్యూబ్‌లో చూసి విదేశీ పండ్ల మొక్కల సాగు
అల్లువెల్లి రాజిరెడ్డి, సుందిళ్ళ, రామగిరి మండలం



యూట్యూబ్‌లో కొత్త రకం, విదేశీ పండ్ల మొక్కలు సాగు వీడియోలను చూసి ఆసక్తితో పలు రకాల విదేశీ, దేశీయ పండ్ల మొక్కలను సాగు చేస్తున్నా. దాదాపు 12 గుంటల స్థలంలో రెండున్నర ఏళ్లుగా వివిధ రకాల విదేశీ పండ్ల మొక్కలను సాగు చేస్తున్నా. వాటిలో కొన్ని ఇప్పటికే కాతకు వచ్చాయి. ఇక్కడి వాతావరణం అనుకూలించక కొన్ని మొక్కలు ఎండి పోయాయి. మరి కొన్ని విదేశీ మొక్కలను పెంచడానికి కృషి చేస్తున్నా.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


దేవయ్య(ఫైల్)

బోయినపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి వేగంగా బైక్‌పై వచ్చి ఆటోను ఢీకొట్టడంతో ఆటోబోల్తా పడిన సంఘ టనలో ఒకరు మృతిచెందగా, ఒకరికి తీవ్ర గాయాలు, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన బోయినపల్లి మండలం కొదురుపాక పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన మేడుదుల దేవయ్య(70)అనే వ్యక్తి తన కూతురు లావణ్య జగ్గారావుపల్లిలో ఆదివారం ఐందిరమ్మ ఇల్లుకు స్లాబ్ వేస్తున్నందున కొదురుపాకలో జగ్గారావుపల్లికి చెందిన రాములు, విజయలతో కలిసి ఆటోలో వెళుతు న్నాడు. వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి గ్రామం చెందిన ప్రవీణ్ అనేవ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో బోల్తా పడడంతో దేవయ్య కాలు తెగిపోగా, విలాసాగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న ప్రయాణిస్తున్న రాములు, విజయలతోపాటు బైక్ వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడ్డవారిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో దేవయ్య మృతిచెందినట్లు తెలిపారు.


నిప్పంటించుకున్న వివాహిత మృతి

కోల్‌సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెడికల్ కళాశాల రహదారి పక్కన శుక్రవారం రాత్రి ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పోతనకాలనీకి చెందిన వివాహిత నల్ల స్వప్న(38) చికిత్సపొందుతూ గోదావరిఖని సిమ్స్ జనరల్ ఆసుపత్రిలో శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. మెరుగైన చికిత్సకోసం ఆమెను హైదరాబాద్‌కు తరలించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేసుకుంటుం డగా మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగి హమాలీ ఆత్మహత్య

ఓదెల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలకుంట గ్రామానికి చెందిన దండు రాజు(47) అనే హమాలీ కార్మికుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన రాజు శుక్రవారం మద్యం మత్తులో గడ్డి మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య దండు రాజేశ్వరి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ కిషన్ తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు


శివాలయంలో గుప్త నిధుల కోసం తవ్విన ఆనవాళ్లు

ముత్తారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సుందిల్లి పురాతన శివాలయంలో గుర్తు తెలియని దుండగులు గుప్తనిధుల కోసం మూడు రోజుల క్రితం తవ్వకాలు జరిపారు. సుందిల్లి గ్రామానికి దూరంగా మానేరు పరివాహక నిర్మానుష్య ప్రాంతంలో ఈ గుడి ఉంది. గర్భగుడిలో లింగం ఎదుట తవ్వకాలు చేపట్టారు. గతంలో కూడా పలుసార్లు ఇక్కడ గుప్త నిధులు ఉన్నాయని భావించి తవ్వకాలు చేపట్టారు. రాత్రివేళల్లో గుర్తుతెలియని దుండగులు తవ్వకాలు చేపట్టడం ఇక్కడ సర్వసాధారణంగా తయారైంది. ఆలయ ప్రాంతంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసి పురాతన ఆలయాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

ధర్మారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోలో గుర్తుతెలియని వ్యక్తి మర్చిపోయిన మొబైల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు ఆటోడ్రైవర్. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మామిడిచందు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం ధర్మారం నుంచి కొత్తూరు వెళ్తుండగా ఆటోలో ఎక్కిన వ్యక్తి మొబైల్ ఫోన్‌ను మర్చిపోయాడు. ఆటోలో ఫోన్ ఉండడాన్ని గమనించిన చందు పోలీస్ స్టేషన్‌కువెళ్లి ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు అందించాడు.


ఎస్ఐకి ఫోన్‌ను అందిస్తున్న చందు

మయన్మార్ సైబర్ నేరగాళ్ల నుంచి ముగ్గురికి విముక్తి

● స్వగ్రామం చేరుకున్న రాయికల్, ధర్మపురికి చెందిన యువకులు


మోసారపు రాజు


గణేష్ చంద్ర

రాయికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మయన్మార్ దేశంలోని సైబర్‌నేరగాళ్ల శిబిరాల్లో చిక్కుకున్న రాయికల్ పట్టణానికి చెందిన ఇద్దరుయువకులు క్షేమంగా స్వదేశానికి చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో మోసారపు రాజు, గణేష్ చంద్ర భారత్‌కు చేరినట్లు ఆటుంబ సభ్యులు తెలిపారు. రాయికల్‌కు చెందిన మోసారపు రాజు నాలుగు నెలల క్రితం మయన్మార్ వెళ్లాడు. మొదట పనిబాగానే ఉందని తెలిపినా, కొద్ది రోజులకే అక్కడ చిత్రహింసలకు పెడుతున్నారని, రూ.4లక్షలు ఇస్తే మాత్రమే భారత్‌కు వంపిస్తామంటున్నారని తన భార్య నవ్యశ్రీకి ఫోన్‌లో తెలిపాడు. ఆ తర్వాత నుంచి ఆయనతో కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదు. అలాగే రాయికల్ పట్టణంలోని భరతమాత కాడలి ప్రాంతానికి చెందిన గణేష్ చంద్ర కూడా ఉద్యోగం వస్తుందని నమ్మి మయన్మార్ వెళ్లాడు. అక్కడ సైబర్ నేరగాళ్ల శిబిరాల్లో బలవంతంగా పని చేయించినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వ జోక్యంతో ఆ దేశంలోని బాధిత భారతీయులను రక్షించి ఆయా రాష్ట్రాలకు అప్పగించారు. మయన్మార్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న రాయికల్‌వాసులు ఇద్దరు చివరకు స్వదేశానికి చేరుకున్నారు.

స్వగ్రామం చేరిన ధర్మపురి యువకుడు

ధర్మపురి: మయన్మార్ సైబర్ నేరగాళ్ల చేతిలో ధర్మపురికి చెందిన యువకుడు ఉన్నాడు. ధర్మపురికి చెందిన క్యామ్‌రావు ఆనంద్ గతంలో జెహ రాన్ దేశం వెళ్లి తిరిగి వచ్చాడు. ఒక మిత్రుని సహాయంతో పది నెలల క్రితం మయన్మార్ దేశం వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి మూడుసార్లు ఫోన్‌చేసి వస్తానని చెప్పాడు. నాలుగు నెలల క్రితం ఒకసారి ఇంటికి ఫోన్ చేశాడు. పాస్‌పోర్టు లాక్కొని అక్కడే ఒకరి వద్ద పెట్టుకు న్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులకు ముగ్గురు కొడుకులు కాగా, ఆనంద్ పెద్ద కుమారుడు. ఈ యువకుడు సైతం కేంద్ర ప్రభుత్వ సహాయంతో స్వదేశానికి తిరిగి వచ్చినట్లు సమాచారం.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

కోరుట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిలాపూర్ నుంచి కోరుట్ల పట్టణానికి గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. పక్క సమాచారంతో కోరుట్ల పట్టణ శివారులోని అయిలాపూర్ రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అయిలాపూర్ నుంచి కోరుట్ల పట్టణం వైపు వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని పరిశీలించగా వాహనంలో 100గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనం నడుపుతున్న వ్యక్తి అయిలాపూర్ గ్రామానికి చెందిన నల్ల విశాల్‌గా గుర్తించారు. కాగా అతనితో ఉన్న మరో వ్యక్తి పరారీ అయ్యాడు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇద్దరు వీఆర్‌ఓలతో కలిసి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

నవోదయ పీటీసీ సమావేశం

కొత్తపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నవోదయవిద్యాలయ(పీటీసీ) పేరెంట్స్ టీచర్స్ కమిటీసమావేశం శనివారం నిర్వహించారు. 15మందివిద్యార్థుల తల్లిదండ్రులు, ఐదుగురు ఉపాధ్యాయులతో నూతనపీటీసీని ఏర్పాటుచేశారు. విద్యాలయంలో చేపడుతున్న అభివృద్ధిపనులను ఇన్‌చార్జ్‌ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తల్లిదండ్రులకు వివరించారు.

నేత్రదానం

జమ్మికుంట రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలోని దుర్గాకాలనీకి చెందిన వజ్ర కృష్ణమూర్తి(73) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సదాశివ ఫౌండేషన్ జిల్లాఅధ్యక్షుడు మచ్చగిరి నరహరి, డీలర్ గర్రెపల్లివెంకటేశ్వర్లు కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించగా అంగీకరించారు. నరహరిఆధ్వర్యంలో వరంగల్ ఎల్వీపీ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ సహకారంతో నేత్ర సేకరణచేసి హైదరాబాద్‌లోని ఎల్వీపీ ఐ బ్యాంక్‌కు పంపించారు.

దొరికిన పుస్తెలతాడు అందజేత


ప్రవంతికి పుస్తెలతాడును అందజేస్తున్న సీఐ రామకృష్ణ

జమ్మికుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన పుస్తెలతాడును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి ఇద్దరు యువకులు నిజాయితీ చాటుకున్నారు. మాచనపల్లి గ్రామానికి చెందిన కనవేనా తిరుపతిరెడ్డి, కనవేనా ప్రశాంత్ శనివారం పనిమీద జమ్మికుంటలోని బీజీ స్కూల్ వద్దకు వెళ్తున్నారు. రోడ్డుపై పుస్తెలతాడు కనిపించింది. దీంతో పుస్తెలతాడును తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. టౌన్‌సీఐ రామకృష్ణ విచారించి పుస్తెలతాడు ఇల్లందకుంట మండలం మల్యాలకు చెందిన నేరెళ్ల ప్రవంతిదిగా తెలుసుకొని ఆమెను పిలిపించి అప్పగించారు. పుస్తెలతాడును పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన తిరుపతిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డిని సీఐ రామకృష్ణ అభినందించారు.

హమాలీల తీరుకు నిరసనగా రైతుల ధర్నా

వీణవంక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో హమాలీల తీరుకు నిరసనగా రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. స్థానిక హమాలీలు ఎక్కువ డబ్బు కావాలని డిమాండ్ చేస్తూ వడ్లసంచులను లారీలలో లోడ్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మండలంలోని అన్నిగ్రామాల్లో వడ్లను సంచుల్లో నింపి కుట్టి కాంటాపెట్టి లారీలో లోడ్‌చేస్తే క్వింటాలుకు 55రూపాయలు తీసుకుంటుంటే నర్సింగాపూర్ హమాలీలు మాత్రం ధాన్యం నింపకుండా సంచులు కుట్టకుండా కేవలం కాంటా వేసినందుకు బస్తాకు 55రూపాయలు డిమాండు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. నాలుగు రోజులపాటు కాంటాలు నిలిపివేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో యూపీకూలీలను తీసుకువచ్చి కాంటాలు వేయిస్తే వారిని స్థానికహమాలీలు అడ్డుకున్నారు. దీంతో రైతులు వారితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడారు. యూపీ కూలీలు క్వింటాలుకు 55రూపాయలు తీసుకుంటున్నారని స్థానిక హమాలీలు బస్తాలు చొప్పున తీసుకొని ప్రత్యేకంగా మామూళ్లు ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. స్థానిక హమాలీలు ఇతర రాష్ట్రాల కూలీలకు పని ఇవ్వవద్దని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ధాన్యం సంచుల్లో నింపితేనే పూర్తి స్థాయి డబ్బులు చెల్లిస్తామని లేదంటే ఇతర రాష్ట్రాల కూలీలతో పని చేయించుకుంటామని రైతులు తెలిపారు. అనంతరం పోలీసులు రైతుల వద్దకు వచ్చి ధర్నా విరమింపజేశారు. రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.


నర్సింగాపూర్‌లో కరీంనగర్-జమ్మికుంట రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కోరుట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల-మెట్‌పల్లి జాతీయరహదారిపై జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మెట్‌పల్లి పట్టణానికి చెందిన గుడ్ల శంకర్, మెట్‌పల్లి మండలం రంగరావుపేట గ్రామానికి చెందిన గండం రాజేష్ ద్విచక్ర వాహనంపై పట్టణ శివారులోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొట్టుకున్నారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వారి బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. కాగా శంకర్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాదుకు వారి బంధువులు తరలించగా రాజేష్‌ను జగిత్యాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

వేములవాడ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. శనివారం రాత్రి సుహాసినులు కార్తీక దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు. ఈ సందర్భంగా సుహాసినులకు వాయనం అందజేశారు. ఆలయంలో కార్తీక పురాణ ప్రవచనం నిర్వహించారు.

● ఎన్టీఆర్ స్టేడియంలో రాజన్న కల్యాణం..

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఓచానల్ నిర్వహిస్తున్న కోటి దీపోత్సవంలో భాగంగా శనివారం రాత్రి వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి కల్యాణం అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవారలకు సీఎంరేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో రమాదేవి, ఆలయ వేదపండితులు పాల్గొన్నారు.


కార్తీక దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు

నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలి

ముత్తారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేరస్తులు నేర ప్రవృత్తిని మాని సత్ప్రవర్తనతో మెలగాలని మంథని సీఐ రాజు అన్నారు. శనివారం ముత్తారం పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని పాతనేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పలు కేసుల్లో నేరస్తులుగా ఉన్న వారు మళ్లీ నేరాలు చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఒక వేళ మళ్లీ పాత పద్ధతులు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పాత నేరస్తులపై పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. కుటుంబాల సంక్షేమం కోసం నేరప్రవృత్తిని మార్చుకొని సమాజంలో హుందాగా జీవించాలని అన్నారు. ఆయన వెంట సీఐ రవికుమార్ తదితరులు ఉన్నారు.


రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న సీఐ

దేశం గర్వించే స్థాయిలో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ సంజీవ్

మానకొండూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో దేశం గర్వించే స్థాయిలో రాణించాలని స్థానిక సీఐ బి.సంజీవ్ అన్నారు. మానకొండూర్‌లోని గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న 11వ గురుకులాల జనల్ స్థాయి క్రీడలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. క్రీడలు దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయన్నారు. సిరిసిల్ల జోనల్ అధికారి ప్రత్యూష, ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, లచ్చయ్య, పీఈడీ జగదీశ్వర్, పీఈటీలు శేఖర్, శివప్రసాద్, భగత్, గోపి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు పోచంపల్లి విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మశ్రీ

మానకొండూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 7న నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన కిరణ్మయి, భార్గవి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా విద్యార్థినిలను శనివారం ప్రిన్సిపాల్ పద్మశ్రీ అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన తాటిపల్లి గురుకుల విద్యార్థులు

మల్యాల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పాఠశా లల యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహిం చిన అండర్-14, అండర్-17 విభాగాల యోగా పోటీలలో కమిలిని, హర్షిణి, హిరన్మయి ప్రతిభ చాటారు. ఈ నెల 15 నుంచి 17 వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనన్నుట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు.



తుది దశకు కూల్చివేతలు

భీమన్న సన్నిధిలో రూ. 3.60కోట్లతో అభివృద్ధి పనులు

శ్రీ భీమేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం రూ. 3.60కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు తుదిదశకు చేరాయి. రాజన్న సన్నిధిలో మొన్నటివరకు ఉన్న ఆర్జిత పూజలను భీమేశ్వరాలయానికి మార్చడంతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో ప్రధానంగా రూ. 50లక్షలతో ప్రసాదం కౌంటర్స్, శంకరమఠ్‌లో రూ. 50లక్షలతో నిత్య కళ్యాణమండపం, రూ. 42లక్షలతో కోడెల క్యూలైన్, రూ.35లక్షలతో దక్షిణం, పశ్చమంలో షెడ్, నవగ్రహ మండపం వైపు రూ. 41 లక్షలతో షెడ్, నటరాజ్ విగ్రహం వద్ద క్యూలైన్ షెడ్, రూ. 50లక్షలతో దేవాలయం చుట్టూ షెడ్, రూ. 27లక్షలతో సీసీ ఫ్లోరింగ్, ప్రాకార వాల్ నిర్మాణం, రూ. 16లక్షలతో వంతెనలు ఇతర అభివృద్ధి పనులు దాదాపు పూర్తికావచ్చాయి.

వేములవాడ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనుల కూల్చివేతలు తుదిదశకు చేరాయి. దీంతో ఆలయంలో రూపురేఖలు మారి పోతున్నాయి. రాజన్న సన్నిధిలో అభివృద్ధి పనుల విస్తరణ కోసం రూ. 76కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో భక్తుల దర్శ నానికి ఇరుకుగా ఉన్న దేవాలయాన్ని విస్తరించను న్నారు. మరో రూ. 35కోట్లతో అన్నదాన సత్రాన్ని నిర్మించడానికి సిద్ధం చేశారు. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో

- మారుతున్న రాజన్న ఆలయ రూపురేఖలు
- రెండో విడతలో ఈవో నివాసం, వీవీఐపీ గెస్ట్ హౌస్
- అభివృద్ధి విస్తరణ పనుల కోసం రక్షణ వలయం

అభివృద్ధి పనులు చేపడుతారు. రాజన్న సన్నిధిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ఇంతకు ముందు ఉన్న పాత భవనాలను కూల్చి వేశారు. ఇప్పటివరకు ఆలయ ఈవో పరిపాలన కార్యాలయం, కళాభవన్, లడ్డు తయారీ కేంద్రం, క్యూ లైన్‌లు తదితర వాటిని కూల్చివేశారు. ఆలయ ఉత్తరం వైపు గోపురం పక్కనుంచి మిషన్ వెళ్లేం దుకు వీలుగా ప్రాకారం తొలగించారు. ఓపెన్ స్లాబ్ తొలగించే పనులు సాగుతున్నాయి. ఆలయ అంతర్భగంలోనూ క్యూలైన్ లన్నీ తొలగించారు. కేవలం తూర్పు రాజగోపురం నుంచి భక్తులకు లోనికి అనుమతిస్తూ లఘు దర్శనం కల్పిస్తున్నారు. రెండవ విడత అభివృద్ధి పనుల సమయంలో ఈవో నివాస భవనం, వివిఐపి గెస్ట్ హౌస్ కూల్చివేయనున్నారు. రాజన్న సన్నిధిలో 4 ఎకరాలకు పైగా జరిగే విస్తరణ పనులు చేపట్ట డానికి తూర్పు, పశ్చిమం వైపున ఎత్తైన రేకులతో రక్షణ వలయాన్ని ఏర్పరిచారు. ఈ వైపుల భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రాకపోకలను నిలిపివేశారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు

- రాజేష్, ఈఈ , వేములవాడ దేవస్థానం

భీమేశ్వరాలయంలో ఆర్జిత పూజలు చేసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టాం. స్వామివారికి కోడెల మొక్కులు చెల్లించేందుకు వీలుగా తూర్పువైపున క్యూలైన్ ఏర్పాటు చేశాం. శ్రీ భీమేశ్వరాలయంలో భక్తులు కోడెల మొక్కుల చెల్లింపు, దర్శనం కోసం చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.



ఆలయ ఉత్తరం వైపు ఏర్పాటు చేసిన రక్షణ వలయం

కూల్చిన మైసమ్మ ఆలయాలను 48 గంటల్లో నిర్మించాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో కూల్చిన 46 దారి మైసమ్మ ఆలయాలను 48 గంటల్లోగా నిర్మించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీలతో ఆయన శనివారం ఫోన్‌లో మాట్లాడారు. హిందూ ఆలయాలంటే చులకన ఎందుకని, రోడ్డుకు అడ్డంగా ఉన్న మసీదులను ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. 48 గంటలు టైమిస్తున్నా.. కూల్చివేసిన మైసమ్మ ఆలయాలను నిర్మించాలన్నారు. లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముగియగానే గోదావరిఖని వస్తానన్నారు. ఆటో డ్రైవర్లు అడ్డాల వద్ద ప్రతి రోజూ మైసమ్మకు మొక్కుకుంటారన్నారు. 48 గంటల్లోగా మైసమ్మ ఆలయాలను నిర్మించాలని, లేక పోతే దారికి అడ్డంగా ఉన్న మసీదులన్నింటినీ కూల్చి వేయాలన్నారు. లేకపోతే గోదావరిఖనికి వచ్చి దగ్గరుండి మసీదులన్నింటిని కూల్చి వేయిస్తానని హెచ్చరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సహా అధికారులందరినీ ప్రజల ముందు నిలబెడతామన్నారు. జరగబోయే పరిణామాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తదుపరి కార్యాచరణపై పెద్దపల్లి జిల్లా నాయకులతో పాటు, రాష్ట్ర నాయకులతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

జగిత్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు.

ముగిసిన జోనల్ క్రీడలు

- అండర్ 14 ఓవరాల్ చాంపియన్ 'మంథని'

ములుగు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ములుగు మండలం జాకారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథులుగా భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల డీసీవోలు భిక్షపతి, యాదగిరి హాజరయ్యారు. జాకారం గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ ఎ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడా పోటీల్లో మొత్తం 935 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. అండర్ 14 ఓవరాల్ చాంపియన్‌గా మంథని నిలిచినట్లు వివరించారు.

కొనసాగుతున్న నీటి విడుదల

ఇల్లంతకుంట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.43టీఎంసీల నీరు ఉంది. 100క్యూసెక్కుల నీరు క్యాచ్‌మెంట్ ఏరియా ద్వారా వస్తుండగా, సర్‌ప్లస్ గేట్ల ద్వారా 100క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలు



భీమేశ్వరాలయం

వేములవాడ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరాలయం విస్తరణ పనుల నేపథ్యంలో ఆర్జిత సేవలను భీమేశ్వరాలయానికి మార్చారు. రాజన్న సన్నిధిలో లఘు దర్శన సౌకర్యం కల్పిస్తూ భీమేశ్వరాలయంలో భక్తులు ఆర్జిత పూజలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. భీమన్న సన్నిధిలోనూ రాజన్న ఆర్జిత సేవల టికెట్ ధరలే అమలు చేస్తున్నారు. అంతకుముందు భీమేశ్వరాలయంలో అమలయ్యే పూజల టికెట్ ధరలకు తేడాలు ఉన్నాయి. ప్రధాన ఆలయమైన రాజన్న సన్నిధిలో ఆర్జిత సేవల టికెట్ ధరలకు, అనుబంధ ఆలయాల్లో జరిగే పూజల టికెట్ ధరలకు వ్యత్యాసం ఉంది. రాజన్న సన్నిధిలో జరిగే ఆర్జిత సేవలతో పాటు కోడెల మొక్కులు భీమేశ్వరలయంలోనే కొనసాగుతున్నాయి. అక్టోబరు 10న పార్వతీరాజరాజేశ్వరస్వామివారి ఉత్సవ మూర్తులను భీమేశ్వరాలయానికి తీసుకొచ్చారు. దీంతో రాజన్న ఆలయంలో జరిగే ఆర్జిత సేవలన్నీ భీమన్న ఆలయానికి మారాయి. అంతకు ముందు భీమన్న గర్భాలయంలో అభిషేక టికెట్ ధర రూ.200 మాత్రమే ఉండేది. ఇపుడు రాజన్న సన్నిధిలో అమలైన అభిషేకం టికెట్ ధర రూ. 1000లు భీమన్న సన్నిధిలో చెల్లించాల్సిందే. ఇకపోతే రాజన్న ఆర్జిత పూజల టికెట్ ధరలను భీమన్న సన్నిధిలోనూ అమలు చేస్తున్నారు. భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవల టికెట్ ధరలు, నిర్వహించే స్థలం వివరాలు ఇలా ఉన్నాయి.

అర్జిత సేవలు	టికెట్ ధర	సమయం	పూజ స్థలం
స్వామివారి అభిషేకం	రూ. 1000	ఉదయం 6-30-10.30	భీమేశ్వర గర్భాలయం
స్వామివారి అన్నపూజ	రూ. 1000	మధ్యాహ్నం 1.30-3.00	భీమేశ్వర గర్భాలయం
స్వామివారి ఆకులపూజ	రూ. 600	రాత్రి 7.00-8.30	భీమేశ్వర గర్భాలయం
కుంకుమ పూజ	రూ. 300	ఉ:7.00- రాత్రి 8.30	శంకరమఠం
స్వామివారి నిత్యకల్యాణం	రూ.1500	ఉదయం 10.30-12.30	అన్నదానసత్రం పైఅంతస్తులో
సత్యనారాయణ వ్రతం	రూ. 600	మధ్యాహ్నం 1.00	అన్నదానసత్రం పైఅంతస్థులో
లింగార్చన	రూ. 1000	సాయంత్రం 6.00	అన్నదానసత్రం పైఅంతస్థులో
కోడె మొక్కులు	రూ. 200	------	భీమేశ్వరాలయం
స్పెషల్ కోడె మొక్కులు	రూ. 500	------	భీమేశ్వరాలయం
నిజ కోడె	రూ. 1,116	-----	భీమేశ్వరాలయం
గండా దీపం	రూ. 5	-----	భీమేశ్వరాలయం
వాహన పూజ (4వీలర్స్)	రూ. 400	ఉ: 7.00 -రాత్రి 7.00	వాహనాల చెక్‌పోస్టు
వాహన పూజ (3వీలర్స్)	రూ. 250	ఉ: 7.00 -రాత్రి 7.00	వాహనాల చెక్‌పోస్టు
వాహన పూజ (2వీలర్స్)	రూ. 100	ఉ: 7.00 -రాత్రి 7.00	వాహనాల చెక్‌పోస్టు
కేశఖండనం	రూ. 50	-------	ప్రధానం చెక్‌పోస్టు వద్దగల షెడ్

నా భర్తను ఇంటికి రప్పించండి

- ప్రవాసీ ప్రజావాణిలో బతికెపల్లి మహిళ వినతి



ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పిస్తున్న అనిత

పెగడపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన గడ్డపై ఉపాధి కరువై పరాయి దేశం వెళ్లి అక్కడ కూడా పని దొరకక అక్కడే ఇరుక్కుపోయిన తన భర్తను ఇంటికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ శనివారం హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన బెక్కం శ్రీను ఉపాధి కోసం 2019లో లేబర్ వీసా మీద సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో చేరగా సరిగా జీతం ఇవ్వకపోవడంతో కంపెనీ నుంచి బయటకు వెళ్లి అక్కడే ఇరుక్కుపోయాడు. అక్కడ ఉపాధి లేక చేతిలో డబ్బులు లేక నానా కష్టాలు పడుతున్నాడని ఇంటి వద్ద నుంచే డబ్బులు పంపిస్తున్నామని తెలిపారు. తన భర్తను ఇండియాకు రప్పించాలని పిల్లలతో కలసి శ్రీను భార్య అనిత ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందించారు.

సీనియర్ సిటిజన్స్ కమిషన్ ఏర్పాటు చేయాలి



కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న నర్సింహారావు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీనియర్ సిటిజెన్స్ హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి సీనియర్ సిటిజన్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని టాస్కా రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో 10వ జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 46మంది సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా 5వ సారి అశోక్‌కుమార్‌తో పాటు, పూర్వ కార్యవర్గం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సత్యనారాయణ చౌదరి, కోశాధికారి తోట జ్ఞానేశ్వర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జీఆర్ దేశాయి, జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

సుల్తానాబాద్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయంలో గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కరీంనగర్ జిల్లా కొత్తపల్లి జట్టు కైవసం చేసుకుంది. వ్యక్తిగత చాంపియన్ షిప్‌ను మెట్‌పల్లికి చెందిన అరుణ్ దక్కించుకున్నాడు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించగా, ఖోఖో పోటీల్లో బూరుగుపల్లి జట్టు , కబడ్డీలో మెట్‌పల్లి జట్టు, వాలీబాల్‌లో కొత్తపల్లి జట్టు విజేతగా నిలిచింది. అథ్లెటిక్స్‌లో వంద మీటర్ల పరుగు పందెంలో విజయకృష్ణ, 200 మీటర్ల పోటీల్లో ప్రణీత్, 400 మీటర్లలో అభినవ్, 800 మీటర్లలో అక్షయ్, 1500 మీటర్ల పరుగు పందెంలో శశికుమర్‌లు విజేతలుగా నిలిచారు. హైజంప్‌లో మెట్‌పల్లికి చెందిన అరుణ్ ప్రథమ, గన్నేరువరంకు చెందిన హర్షవర్ధన్ ద్వితీయ, సిరిసిల్లకు చెందిన ధనుష్ తృతీయ స్థానం సాధించారు. అలాగే లాంగ్‌జంప్‌లో అరుణ్ ప్రథమ, విగ్నేష్ ద్వితీయ, అభిరామ్ తృతీయ స్థానాలు పొందారు. డిస్క్‌త్రోలో సుల్తానాబాద్‌కు చెందిన రాజ్ కుమార్, షాట్‌పుట్‌లో సింగరాయపేటకు చెందిన నిఖిల్ ప్రథమ, కొత్తపల్లికి చెందిన నిరంకార్ ద్వితీయ, బీర్పూర్‌కు చెందిన శ్రీకర్ తృతీయ స్థానంలో నిలిచారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్‌పీడీసీఎల్ బాస్కెట్‌బాల్ కోర్టులో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథులుగా ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నందెల్లి మహిపాల్, ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఆరు బాలికల జట్లు, 14 బాలుర జట్లు పాల్గొనగా విజేతలకు ఐవీవై స్కూల్ డైరెక్టర్ జయ మహేష్ బహుమతులను ప్రదానం చేశారు. బెస్ట్ ప్లేయర్ అవార్డులను ఎల్‌పి రాజు, ఏడీఈ ఎం సుధీర్‌కుమార్ ప్రదానం చేశారు. అనంతరం అతిథులను సన్మానించారు. క్రీడాకారులు ఐవ్వేర్ బాస్కెట్‌బాల్ అకాడమీ బాధ్యులు భోజన సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు అజీముల్లాఖన్, తేజస్ డిఫెన్స్ అకాడమీ చీటి సతీష్‌రావు, ఫాదర్ సంతోష్ రెడ్డి, సెయింట్ అల్ఫోన్స్ హెచ్‌ఎం అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీటి కార్తీక్, పెటా అధ్యక్షులు శ్రీధర్, పోటీల నిర్వాహకులు జి శ్రీధర్‌రావు, బి జీవన్ కుమార్, డి సత్యానందం, సునీల్‌కుమార్, పి భార్గవ్, జగదీష్, బాలచంద్రన్, వినీల్‌కుమార్ ఉన్నారు.



బాస్కెట్‌బాల్ ఆడుతున్న బాలకల జట్టు

బీడీ కార్మిక జాతీయ సభలు

కోరుట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20, 30వ తేదీలలో వేములవాడ పట్టణంలో నిర్వహించే ఆల్ ఇండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని బీడీ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు కోరారు. శనివారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించి జాతీయ సభల కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుతారి రాములు మాట్లాడారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేస్తున్న జాతీయ సభలను విజయవంతం చేయాలని కొరారు. సమావేశంలో బీడీ కార్మిక సంఘ నాయకులు మౌళనా, కొక్కుల శాంత, ఎన్నం రాధ, హన్మంత్, వెన్న మహేష్, కిరణ్, దేవదాస్, మక్రం, ఆలీ, అందె వంశీకృష్ణ ఉన్నారు.

18వ రోజు గోదావరి హారతి



గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో గోదావరి హారతి 18 వ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావుఉన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన కార్తీక భక్తుల రద్దీ

ధర్మపురి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో మూడవ శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణాలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు ఆంజనేయ స్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనేక మంది దీపాలు వెలిగించి భక్తి శ్రద్దలతో పూజించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

● సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో గణపతి ఉపనిషత్‌లతో శనివారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక నిర్వహించారు.



ధర్మపురిలో స్వామివారలను దర్శనం చేసుకుంటున్న భక్తులు

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. కార్తీకమాసం కావడంతో కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.

కరీంనగర్-జగిత్యాల రోడ్డుకు మోక్షమెప్పుడో?

(5వ పేజీ తరువాయి)

డ్యామ్ బైపాస్ మీదుగా మల్యాపూర్ రోడ్డులో మళ్లీ ప్రధాన రహదారి మీదకు వస్తుంటాయి. అయితే ఈ భారీ వాహనాలు వచ్చే బైపాస్ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. కొన్నిచోట్ల రోడ్డు మధ్యలో నడుములోతు గుంతలు ఏర్పడడంతో వాహనాలు ఎలా వెళ్లాలో తెలియక ప్రమాదపు అంచున నడిపిస్తున్నారు. కరీంనగర్-జగిత్యాల జాతీయరహదారిని నాలుగులైన్లతో అభివృద్ధి చేసేందుకు భూసేకరణ వేగంగా చేపట్టి పనులు ప్రారంభించాలని అంటున్నారు. ఆలోగా ప్రమాదకరంగా ఉన్న గుంతలన్నింటిని పూడ్చివేయాలని, రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను తొలగించాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కళలతో సృజనాత్మకత వెలికితీత

కరీంనగర్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సృజనాత్మకతను వెలికి తీసేందుకు కళలు తోడ్పడుతాయని విశ్రాంత ప్రిన్సిపాల్, కాలమిస్ట్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం కళాభారతిలో మల్లేశం, జీఎస్‌పీ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సాంస్కృతిక, విద్యా సంబంధ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ వైవిద్యభరిత కళలకు కాణాచి కరీంనగరం అని అన్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సౌజన్య, రవీందర్, సుమలత, శ్రీజ, సుమన్, రమ, రాజేశ్, రామకృష్ణ, జయలక్ష్మి, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టు ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, లావణ్య తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11 వరకు ఫైర్ స్టేషన్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్, ఫౌండేషన్ స్కూల్, విఘ్నేశ్వర హాస్టల్, ఆర్‌బీ స్వీట్ హౌస్ ఏరియా, అన్వర్ హోటల్, శ్రీరామ బుక్‌స్టాల్, మోర్ సూపర్ మార్కెట్, గోపాల్‌రావు, భవన నిర్మాణం ప్రాంతం, వాణి సూపర్ మార్కెట్, జాఫ్రీ మసీద్, జిల్లా లైబ్రెరీ, వాణికేతన్ కళాశాల, ఉదయం 8:30 నుంచి 10:30 వరకు బోయవాడ, సిఖ్వాడి, అన్నపూర్ణ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆవిర్భావ వేడుకలు

భగత్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జార్జిరెడ్డి పీడీఎస్‌యూ మొదటి ఆవిర్భావ వేడుకల సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్ శనివారం నగరంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తరుణ్ శ్రీనివాస్, జగన్, రాజేష్, సురేందర్, మహేందర్, రాకేష్, సందీప్, సిద్ధార్థ, నవీన్, సతీష్, రంజిత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సోదరుడి కుమార్తె వివాహంలో మంత్రులు

కరీంనగర్ అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి కుమార్తె వివాహం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. వివాహ వేడుకకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎస్సీ, ఎస్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు.

విద్యార్థులకు గవర్నర్ ప్రశంసలు

గంగాధర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం బూరుగుపల్లి విద్యార్థులను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రశంసించినట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ శనివారం తెలిపారు. శుక్రవారం శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవానికి గవర్నర్ హాజరయ్యారు. ముందుగా కలెక్టరేట్‌లో జిల్లాలోని ఐదు పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనను తిలకించారు. అందులో గంగాధర మండలం బూరుగుపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ప్రయోగం వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రోత్సహించినట్లు తెలిపారు.

జనావాసాల మధ్య ఉన్న వైన్స్ తొలగించాలి

కరీంనగర్ క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ గాంధీనగర్‌లో జనావాసాల మధ్య ఉన్న వైన్స్‌ను తొలగించాలని స్థానికులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు సంవత్సరాలుగా వైన్స్ ఇక్కడే కొనసాగుతోందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కొత్త షాపులకు ఈ ప్రాంతంలో అనుమతి ఇవ్వవద్దని కోరారు.

గణపతికి పంచామృతాభిషేకం

కరీంనగర్ రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు గోపాల్ పూర్‌లోని చింత్ చెరువులో ఉన్న గణపతికి సంకష్ట చతుర్థి సందర్భంగా శనివారం పంచామృతాభిషేకం నిర్వహించారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి పాల్గొన్నారు.

సర్టిఫైడ్ మోటార్ డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్

గణేశ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సర్టిఫైడ్ మోటార్ డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ కరీంనగర్ నూతన అధ్యక్షుడిగా శ్రీపతి కళ్యాణ్ కుమార్, జనరల్ సెక్రెటరీగా గంగిపెల్లి చంద్రశేఖర్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా విశ్వనాథ్ బలరాం, ముఖ్య సలహాదారులుగా ఎల్లం సత్యనారాయణ, పత్తి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. బొమ్మన రాజేష్, సయ్యద్ నిసర్, రాజు బిస్మిల్లా ఖాన్, రాజయ్య, మధుకర్‌రెడ్డి, కిషోర్‌కుమార్, స్వప్న, రాజేశ్వరి పాల్గొన్నారు.

12న ఎలక్ట్రిసిటీ యూనియన్ 1104 ఎన్నికలు

గణేశ్‌నగర్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 జిల్లా సర్వ సభ్య సమావేశం, ఎన్నికలు ఈ నెల 12న బుధవారం గోపి కృష్ణ ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్నట్లు డిస్కం సెక్రెటరీ సల్వాజి వెంకటరమణ రావు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు, సాయి బాబు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, డిస్కం అధ్యక్షుడు రఘునందన్ పాల్గొని ఉద్యోగుల సమస్యలపై వివరణ ఇస్తారని పేర్కొన్నారు. ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు శుభకృత్ కవితా సంపుటి ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఫిలింభవన్‌లో కాళిదాసు రచించిన శుభకృత్ కవితా సంపుటిని ఆవిష్కరించనున్నట్లు అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ప్రకటనలో తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరాస్వామి, సాహితీ వేత్తలు డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, దాస్యం సేనాధిపతి, అన్నాడి గజేందర్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి మృతి

● పలువురి సంతాపం



నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మికాంతారావు

హుజూరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఎస్సారెస్పీ ప్రాజెక్టు-1 మాజీ చైర్మన్ చోలేటి కిషన్‌రెడ్డి (62) పెళ్లి వేడుకల్లో డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం కిషన్‌రెడ్డి సమీప బంధువు కుమార్తె వివాహం జరిగింది. వధూవరులను పంపించే క్రమంలో కిషన్‌రెడ్డి డ్యాన్స్ చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. ఆయన మృతికి మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సంతాపం తెలిపారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. డీసీసీ కార్యాలయంలో, ఇందిరాచౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గుండాటి శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్ చేశారు.

● కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చర్ల పద్మ, నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెన్నెం రజితరెడ్డి ఇందిరా చౌక్ వద్ద భారీ కేక్ కట్ చేశారు. నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెన్నం రజితరెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ రోడ్డు వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. నగర కాంగ్రెస్ నాయకులు దీకొండ శేఖర్ ఆధ్వర్యంలో మైత్రి కన్వెన్షన్ వద్ద కేక్ కట్ చేశారు. నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి బాబు ఉన్నారు.

కరీంనగర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖలీం ఆధ్వర్యంలో హైమద్ పుర చౌరస్తా వద్ద నగర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శరణ్య గౌడ్, మాజీ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ కేక్ కట్ చేశారు. రెండో డివిజన్ తీగలగుట్టపల్లికి చెందిన కాంగ్రెస్ నేత కొలగాని అనిల్ నివాసం వద్దకేక్ కట్ చేశారు. నాయకులు శ్రావణ్ నాయక్, ముస్తాక్ అహ్మద్, బొబ్బిలి విక్టర్, కుర్ర పోచయ్య, వంగల విద్యాసాగర్, మడుపు మోహన్, సలీముద్దీన్, చింతల కిషన్, కుంభాల రాజ్ కుమార్, యనమల మంజుల, పర్వత మల్లేశం, అంజయ్య, ఈశ్వరి, నూనె గోపాల్‌రెడ్డి, సుధాకర్ నాయక్, మాదాసు శ్రీనివాస్, అంజయ్య, మూల జైపాల్, నత్తినేని శ్రీకాంత్, స్వప్న శ్రీ, మాలోతు మహాలక్ష్మి, హైమద్‌సోషల్ మీడియా డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఆమీర్ సిరిపురం నాగప్రసాద్, చింతల కిషన్, ఎలగందుల మునీందర్, భూసా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలంలో శనివారం సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగునూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ కార్యదర్శి కస్తూరి కృష్ణారెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాం రెడ్డి, నాయకులు ఇట్టిరెడ్డి సుధాకర్ రెడ్డి, కర్ణాకర్, శ్రీనివాస్ గడ్, రాజేష్ కన్న, గద్దల అజయ్, శేఖర్ పాల్గొన్నారు.

చామనపల్లిలో మండల అధ్యక్షుడు రాంరెడ్డి కేక్‌ను కట్ చేశారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుంకరి రమేష్, వీరమనేని పరిసరామారావు, సాయిని రవి, పూదరి రేణుక, శివకుమార్, తోట స్వప్న, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బసవయ్య కేక్ కట్ చేశారు.

ఇల్లందకుంట: కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్, ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి పేరు మీద ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సారంగపాణి, సంపత్, సంజీవరెడ్డి, శివకుమార్, పరమేశ్వర్, కిరణ్, రాజేందర్, చిరంజీవి, మల్లేశం, గోపాల్‌రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కేక్ కట్ చేస్తున్న సిటీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

సైదాపూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ న్యాదండ్ల రాజ్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపెల్లి కిష్టయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు లంకదాసరి మల్లయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు పోగు రమేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో కాంగ్రెస్ అధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, నాయకులు చినాల అయిలయ్య, భగవాన్ రెడ్డి, సాహెబ్‌హుస్సేన్, నల్ల కొండాల్ రెడ్డి, గంగాడి రాజిరెడ్డి, రషీద్‌పాషా, మ్యాక వీరయ్య, కొండాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మోటం శ్రీనివాస్, కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నిజానపురం చందు, మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్, నాయకులు పురం రాజేశం, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, కొట్టె అశోక్, మునిగాల రాజేందర్, వొల్లాల కృష్ణహరి, మునిగాల చందు, గుర్రం రమేష్‌గౌడ్, ముద్దం తిరుపతిగౌడ్, ముద్దసాని రంగన్న, మావురపు రాములు, నెరుమట్ల మల్లేశం పాల్గొన్నారు.

పతకాలతో కళాశాల ప్రతిష్ట మరింత పెంపు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్

గణేశ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవంలో వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో చదివిన ఎనిమిది మంది విద్యార్థులు 11 బంగారు పతకాలు సాధించి కళాశాల ప్రతిష్టను మరింత పెంచారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. శనివారం కళాశాలలో బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులను సన్మానించారు. విద్యార్థుల కృషి, అంకితభావం, ఉపాధ్యాయుల మార్గదర్శకత ఫలితంగా సాధ్యమైందన్నారు. కళాశాల కరస్పాండెంట్ వి.ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఏసీటీబీ సంపత్ కుమార్, బి.శ్రవణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి సాగర్, విభాగ అధి పతుల డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ ఎండీ సలీం పాల్గొన్నారు.

వాగేశ్వరి కళాశాలల అధ్యాపకుడికి అభినందనలు



అధ్యాపకుడిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి

గణేశ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు అధ్యాపకుడు కుందేటి సత్యనారాయణ రెండు బంగారు పతకాలు అందుకోవడం కళాశాలకు గర్వకారణమన్నారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యనారాయణను చైర్మన్ బీవీఆర్ గోపాల్ రెడ్డి అభినందించారు. యూనివర్సిటీ స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించడం సత్యనారాయణ అంకితభావానికి నిదర్శనమన్నారు. కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రత్న గోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్‌లు సతీష్ గౌడ్, లింగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌గా నిలవాలి

కరీంనగర్‌స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):రంగారెడ్డి జిల్లాలోని యూనివర్సల్ పాఠశాలలో ఈ నెల 9న నిర్వహించనున్న 12వ సబ్ జూనియర్స్, జూనియర్స్ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు చాంపియన్‌గా నిలవాలని జిల్లా యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వాలన్నారు. 8 నుంచి 18 సంవత్స రాల్లోపు వయస్సుల విభాగాల్లో ఎంపికైన 50 మంది పోటీల్లో పాల్గొంటున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి సిద్దారెడ్డి, గుంటి రామకృష్ణ తెలిపారు. జిల్లా జట్టుకు అసోసియేషన్ కోశాధికారి స్వరూపాచారి, యోగా కోచ్‌లు కిష్టయ్య, మల్లేశ్వరి, హసనీ, కోచ్, మేనేజర్లుగా వ్యవహరించనున్నట్లు వివరించారు.



ఎంపికైన క్రీడాకారులతో రవీందర్‌సింగ్

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న డీఈవో మొండయ్య

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, అభివృద్ధికి దోహదం చేస్తాయని డీఈవో డాక్టర్ మొండయ్య అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఎన్‌పీఎల్(నారాయణ ప్రీమియర్ లీగ్) జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాం లభిస్తుందన్నారు. అనంతరం ఏజీఎం అన్నం చైతన్యరావు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. అంతకుముందు ఆరు జిల్లాలకు చెందిన నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రిన్సిపాల్‌లు, అకాడమిక్ డైరెక్టర్లు, టీచర్లు పాల్గొన్నారు.

గణపతి ప్రతిష్ట మహోత్సవం

తిమ్మాపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లో స్వయంభువుగా వెలసిన లక్ష్మిగణపతి స్వామి దేవాలయంలో సధ్వజ నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారికి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కంది అశోక్ రెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

యజ్ఞవరాహక్షేత్రంలో భూమి పూజ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక యజ్ఞవరాహక్షేత్రంలో శనివారం నూతన వాహన మండపం, సర్వ వైదిక సంస్థానం ట్రస్టు కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు



తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రేకుర్తిలో రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల పొదలను అధికారులు తొలగించారు. బీజేపీ జోన్ అధ్యక్షుడు జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించగా అక్టోబరు 13వ తేదీన అడవిని తలపిస్తున్న రహదారులు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు శనివారం రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం చలో ఢిల్లీ కార్యక్రమం

తిమ్మాపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మాలల రాజ్యాంగ హక్కుల సాధన కోసం హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు మాల మహానాడు కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక అంజనేయులు తెలిపారు. ఈ నెల 26న రాజ్యాంగ హక్కుల సాధన కోసం జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని మండలంలోని ఇందిరానగర్ అంబేద్కర్ చౌరస్తాలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాలలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంత చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుక అంజనేయులు, మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జి లింగం కుమార్, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు ఎలుక రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

జాతీయ స్థాయి కళోత్సవాలకు అల్ఫోర్స్ విద్యార్థి



అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కళోత్సవాల్లో అల్ఫోర్స్ విద్యార్థి శ్రీనిధి జాతీయ స్థాయికి ఎంపికైంది. శనివారం విద్యార్థినిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కళోత్సవాల్లో జాతియస్థాయికి ఎంపికవడం గొప్ప విషమన్నారు. విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు నిష్ణాతులైన శిక్షకులతో శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెయింట్ జార్జ్ విద్యార్థినుల ప్రతిభ



అభినందిస్తున్న సెయింట్ జార్జ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ పి.ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): క్రికెట్, యోగా, ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో సెయింట్ జార్జ్ విద్యార్థినులు ప్రతిభ చాటారు. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులు మోనాలిక, శ్రీవల్లి, విన్మయిని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ క్రికెట్, యోగా, ఎయిర్‌రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ చాటి జోనల్ స్థాయి, జిల్లా స్థాయికి ఎంపికవడం అభినందనీయమన్నారు.

బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌లో షోకేస్ డే



ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థులు

కరీంనగర్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌లో శనివారం జార్ఖండ్‌పై షోకేస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జార్ఖండ్ సంస్కృతి, గిరిజన జీవనం, ప్రసిద్ధ వ్యక్తులు, కోటలు, జలపాతాలు, అరణ్యాలు, అరణ్య సంపద వంటి అంశాలపె ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథ్ విద్యార్థులను ప్రశంసించారు.

శ్రీభాష్యం 'శారదా పదకింకిణి'పై అనుశీలనం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):పద్మశ్రీ అవార్డు గ్రహీత, సంస్కృత పండితుడు, స్వర్గీయ శ్రీభాష్యం విజయసారథి సారస్వతానుశీలనంలో భాగంగా సర్వ వైదిక సంస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో యజ్ఞవరాహక్షేత్రంలో శనివారం 'శారదా పదకింకిణి' కావ్యంపై సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు ప్రసంగించారు. శారదాపదకింకిణిలో శబ్ద, భావ, అర్థ విస్తృతి పుష్కలంగా కనిపిస్తోందన్నారు. అందులో శ్లోకాలు పఠించి అర్థాలను విపులంగా వివరించారు. ఛందస్ విద్యాసంస్థల బాధ్యుడు ప్రభాకరరెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సాహిత్య విభాగ కన్వీనర్ శేషాచార్య, సభ్యులు పాల్గొన్నారు.